ప్రజాశక్తి
గురువారం 18 మే 2023 5 విజయనగరం

కార్మికులకు రక్షణ చర్యలు తీసుకోండి : డిసిఎల్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కార్మికులు వడగాల్పులకు గురికాకుండా భవన నిర్మాణ సంస్థల యాజమానులు, దుకాణాల సంస్థలు, పరిశ్రమల యజమానులు, వర్తక వాణిజ్య ప్రతినిధుల రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ ఎన్. సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులందరికి ముఖ్యంగా బయట పనిచేసే కార్మికులకు రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం డిజాస్టర్ మేనేజ్ మెంట్ ఏజెన్సీ నుంచి ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల మధ్య బయట వేడి వాతావరణంలో పని చేయకుండా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో అందరికీ తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు పాట్లు

పది తప్పిన విద్యార్థులతో

- ప్రత్యేక తరగతులకు నిరాకరిస్తున్న విద్యార్థులు
- మండుటెండలో ఊరూరా తిరుగుతున్నఉపాధ్యాయులు
- అయినా హాజరు అంతంత మాత్రమే
- ఎండ తీవ్రతతో ఇబ్బందులు.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

రేగిడి : జెడ్‌పి హైస్కూలులో హాజరైన విద్యార్థులు

పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మండుతున్న ఎండలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు విద్యార్థులు సముఖత చూపకపోగా, హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారుల ఒత్తిడితో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 8 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. అయితే విద్యార్థులు రాకపోవడంతో వారి ఇళ్లకు వెళ్లి తీసుకొచ్చి మరీ తరగతులు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి పాఠశాలకు రావాలని కోరుతున్నా, మండువేసవిలో పాఠశాలకు వచ్చేందుకు పిల్లలు నిరాకరిస్తున్నారు. ఓ వైపు ఎండలో ఊరూరా తిరుగుతున్నా విద్యార్థులు రాకపోవడం, మరోవైపు హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికారుల ఒత్తిడితో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ప్రజాశక్తి-విలేకర్లు

జిల్లా	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత	ఫెయిలైనవారు
విజయనగరం	24,040	18,430	5610
మన్యం	10,689	9,350	1339

బతిమలాడుతున్నా రావడం లేదు..

రేగిడి : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న పది తప్పిన విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి బతిమాలి ప్రత్యేక తరగతులకు రావాలని కోరుతుఆన్న ససేమిరా అనడంతో వచ్చిన కొద్దిమందితోనే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఎండలలో పాఠశాలల వరకు వచ్చిన విద్యార్థులు తిరిగి ఆటలకు కొంతమంది, మరి కొంతమంది ఇళ్లకు, ఇంకొంతమంది ప్రయాణాలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో వచ్చిన ఐదు, పది మంది విద్యార్థుల తోనే బోధన చేపడుతున్నారు. రేగిడి మండలంలో 521 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 127 మంది పరీక్షలు తప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలతో పాటు 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధన నిర్వహిస్తున్నారు. రేగిడిలో 21 మంది, కందిసలో 32 మంది, అంబాడ వెంకటాపురం, లింగాల వలస, పనసలవలస, కాగితాపల్లి, ఖండ్యాం, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో 30 నుంచి 35 శాతం విద్యార్థులు పరీక్షలు తప్పడంతో వారికి బోధిస్తున్నారు. ఎక్కువ మంది గైర్హాజరు కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి.

మండుటెండల్లో ప్రత్యేక తరగతులపై తల్లి దండ్రుల అసంతృప్తి

వేసవి ఎండలు తీవ్రత కారణంగా ప్రత్యేక తరగతులకు విద్యార్థులు పంపించాలంటే వడదెబ్బలకు గురవుతారేమో నన్న భయంతో విద్యార్థులు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకటి, రెండు సబ్జెక్టులను తమ పిల్లలను ఇంటివద్దే చదివించు కుంటూ పాసయ్యాలా చూసుకుంటామని చెబుతున్నారు.

బాడంగి : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుండి 11.30 వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. పరీక్ష తప్పిన 40 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 20 మంది మాత్రమే హాజరవుతున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తున్నా, ఇళ్లకు వెళ్లి చెప్పినా పూర్తిస్థాయిలో రావడం లేదని హెచ్‌ఎం సిద్ధాంతం త్రినాధరావు తెలిపారు. అయినా ఉపాధ్యాయులు విద్యార్థుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రత్యేక తరగతులకు నిరాకరిస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్ : ప్రత్యేక తరగతుల బోధన కోసం ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బతిమలాడుతున్నా గైర్హాజరు కావడం లేదు. అధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయులు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తిరుగుతున్నారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు రాకపోగా అటు ఉపాధ్యాయులు కూడా ఇబ్బంది పడుతున్నారు. వచ్చిన కొద్దిమందితోనే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. గంట్యాడలో జెడ్‌పి హైస్కూలులో ఇద్దరు, సారిపల్లిలో 17 మందికి 12 మంది, ఒక్కొక్క రోజు 10మంది వరకు హాజరవు తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని హైస్కూళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పలు గ్రామాల నుంచి హాజరు కాని విద్యార్థులు

పూసపాటిరేగ : ఎండలు భగభగ మండడంతో ప్రత్యేక తరగతులకు వచ్చేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. మండలంలోని 12 పాఠశాల నుండి 926 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. ఫెయిలైన 371 మంది విద్యార్థుల కోసం 12 కేంద్రాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను శిక్షణ కేంద్రాలకు తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు ముగ్గురు విద్యార్థులను దత్తతగా తీసుకొని వారి ఫోన్ నెంబర్లతో ఫాలప్ చేస్తున్నారు. అయినా ఎండవేడిమికి తట్టుకోలేక అల్లాడి పాలెం, కందివలస తదితర గ్రామాల విద్యార్థులు హాజరు కావడం లేదు. ఈ నేపథ్యంలో తరగతుల నిర్వహణ ఉపాధ్యాయులకు కత్తిమీద సాములా మారింది.

నేడు చంద్రబాబు రాక

దేవీబొమ్మ కూడలిలో సభ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగాగురువారం ఎస్.కోట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రోడ్డుషో, బహిరంగసభలో పాల్గొననున్నారు. ఈమేరకు ఆపార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ జిల్లా వేపగుంటలోని మీనాక్షి కన్వర్షన్ సెంటర్ నుండి చంద్రబాబు ఎస్.కోటకు చేరుకుంటారని తెలిపారు. కొత్తూరు శివాలయం నుండి రోడ్ షో ద్వారా పట్టణంలోని దేవి కూడలికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం పట్టణంలోని దేవి కూడలిలో ప్రసంగిస్తారన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని సిరికి గ్రీన్ సిటీలో బస చేస్తారు. 19న ఉదయం పట్టణంలోని సిరికి గ్రీన్ సిటీలో భీమసింగి చక్కర కర్మాగారం రైతులతోనూ, గిరిజన యూనివర్సిటీ విషయమై గిరిజన విద్యార్థులతోనూ, పట్టణంలోని బిసి సామాజిక వర్గంతోనూ చర్చించి వారి సమస్యలపై వినతులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సిరికి గ్రీన్ సిటీ నుంచి బయలుదేరి అనకాపల్లికి చేరుకుంటారని అమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, క్లస్టర్ ఇంఛార్జ్ ఇందుకూరి శ్రీనురాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు కె.మల్లేశ్వరరావు, పొట్నూరు వెంకట రత్నాజీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం

ఆరోగ్యకరమైన సమాజానికి పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి యని, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణ ప్రవర్తనలో మార్పు అనే అంశంపై ప్రభుత్వ శాఖల అధికారులతో జెసి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. విద్యుత్తును, నీటిని పొదుపు గా వాడాలని, ఈ విషయాల పై ఆయా శాఖలు విస్తృత అవగాహన కలిగించాలని అన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని పూర్తిగా నిషేధించాలన్నారు. పచ్చదనాన్ని పెంచి, సేంద్రియ ఆహారాన్ని వినియోగించి ఆరోగ్యకరకరమైన వాతావరణంలో జీవించేలా చూడాలన్నారు. విద్యార్థి దశ నుండి పర్యావరణం పై అవగాహన కలిగించాలని లేకుంటే భవిష్యత్తు కాలుష్య కోరల్లో చిక్కుకుం టుందని, అందు కోసం ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహనా తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి, డిఆర్‌డిఎ పీడీ, డిపిఒ, డిఇఒ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, పోలీస్ శాఖల అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని రూ.2కోట్లకు టోకరా

పోలీసులకు పట్టుబడిన నిందితులు

ప్రజాశక్తి-తెర్లాం

ఆంధ్రా యూని వర్సిటీలో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి పలువురు నిరుద్యోగుల నుంచి సుమారు రూ. 2కోట్లు వసూలు చేసి పరారైన నిందితులు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. మండలంలోని పెరుమాలి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బేరిగంగాధర్, పూర్ణచందన నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలిస్తామని చెప్పి భారీగా డబ్బులు వసూలు చేశారు. బేరి పూర్ణచందన ఆంధ్ర యూనివర్సిటీలో ఉద్యోగంలో పెద్ద పోస్టులో ఉన్నానని, డబ్బులు ఇస్తే వివిధ పోస్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని బంధువులకు, స్నేహితులకు చెప్పడంతో నిజమేనని నమ్మి పెరుమాలి, నెమలం, రాజాం, నరసన్నపేట తదితర గ్రామాలకు చెందిన నిరుద్యోగులు డబ్బులు చెల్లించారు. కొన్ని రోజుల తరువాత రూ.22 వేల జీతంతో నకిలీ ఆర్డర్లు సృష్టించి, నకిలీ గుర్తింపు కార్డులు, జాబ్ కార్డులు సృష్టించి ఇచ్చారు. తీరా అవి నకిలీ ఆర్డర్లని తెలియడంతో మోసం చేశారని గుర్తించిన బేరి ప్రశాంత్ కుమార్, తోలేటి రాజేష్, బాలరాజు, భుజంగరావు, పుచ్చల గురుమూర్తి, ఇలా కొంతమంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో నకిలీ ఉద్యోగాల గుట్టురట్టు అయ్యింది. అప్పటి నుంచి పోలీసులు నిందితుల కోసం రెండేళ్లుగా పలుజిల్లాలు, రాష్ట్రాల్లో గాలించారు. చివరకు చీపురుపల్లిలో వారిని పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వీరిపై పలు సెక్షన్ కింద అరెస్టు చేసి బొబ్బిలి కోర్టులో హాజరు పరచగా 14రోజులు రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

పోలీసులకు పట్టుబడిన నిందితులు

22 నుంచి బదిలీల జాతర

ప్రభుత్వ ఉత్తర్వులు జారీతో సందడే సందడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 22నుంచి బదిలీల జాతర మొదలు కానుంది. ఈమేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు (జిఒ ఎంఎస్‌నెంబర్ 71) జారీచేయడంతో ప్రభుత్వ శాఖల్లో సందడే సందడి. ఏటా బదిలీల ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా ఈనెల 22నుంచి 30వ తేదీ వరకు బదిలీలు జరగనున్నాయి. ఏప్రిల్ 30నాటికి ఒకే చోట రెండేళ్లకు పైబడి పనిచేసిన వారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదేళ్లు పైబడినవారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. 40శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం గలవారి దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. జీవిత భాగస్వామి, పిల్లలు, లేదా తల్లిదండ్రులు అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగుల దరఖాస్తులను శాఖాధిపతులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి మానవతా ధృక్పథంతో పరిశీలించాల్సివుంటుంది. అటువంటివారికి కీలక వైద్యసేవలు ఉన్న ప్రాంతంలో కొనసాగించడం లేదా పోస్టింగ్ ఇవ్వడం వంటి అవకాశాలు ఉంటాయి. నోటిఫైడ్ ఏజెన్సీ ఏరియాలో పోస్టుల ఖాళీల భర్తీకి ప్రాధాన్యతనిస్తారు. వెనుక బడిన ప్రాంతాల్లో ఖాళీల భర్తీకి కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సివుంటుంది. ఐటిడిఎల్లో రెండేళ్లకుపైగా లోకల్, జోనల్ కేడర్‌లో పనిచేసినవారికి సీనియార్టీ ప్రాతిపదికన వారు ఎంచుకున్న ప్రాంతానికి బదిలీ చేసే అవకాశం ఉంటుంది. ఐటిడిఎలో ఇప్పటి వరకు పనిచేయని ఉద్యోగులు, 50ఏళ్లు వయసులోపుగల ఉద్యోగులు ఐటిడిఎలో పనిచేసేందుకు సిద్ధపడాల్సివుంటుంది. ఎసిబి, విజిలెన్స్ కేసులు ఉన్న ఉద్యోగుల అభ్యర్థనలు బదిలీ దరఖాస్తులు పరిగణలోకి తీసుకునే అవకాశం కల్పించలేదు. బదిలీల్లో భాగంగా కొన్ని శాఖల్లోని ఉద్యోగులకు అవకాశాన్ని బట్టి ఉద్యోగొన్నతులు కూడా వచ్చే అవకాశాలు ఉండవచ్చు.

పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, సంక్షేమ శాఖల అధికారులకు ఈ జిఒ వర్తించదు. వారికి ప్రత్యేక జిఒలు వెలువడే అవకాశం ఉంది. బదిలీల ఉత్తర్వులు విడుదలైన నేపథ్యంలో సిఫార్సుల కోసం రాజకీయ నాయకుల వద్ద హడావుడి ప్రారంభం కానుంది. గత అనుభవాల దృష్ట్యా ఉద్యోగులు, అధికారులు, సాధారణ ప్రజల్లో ఈ రకమైన చర్చ ముమ్మరంగా సాగుతోంది. ఫిర్యాదులు, ఆరోపణలకు తావు లేకుండా శాఖాధిపతులు బదిలీలు చేయాలని, అటువంటివాటికి అధిపతులే బాధ్యత వహించాల్సివుంటుందని జిఒలో స్పష్టంగా ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలు ఏ మేరకు అమలవుతాయో వేచి చూడాల్సిందే.

విద్యుత్ సమస్యలు పరిష్కారానికి టోల్ ఫ్రీ 1912 నెంబర్‌ను సంప్రదించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం, చీపురు పల్లి డివిజన్‌లలో ఏ ప్రాంతంలో నైనా విద్యుత్ సమస్యలు వస్తే వాటి పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం వచ్చిన ఈదురుగాలులు, అకాల వర్షానికి చెట్లు, స్తంభాలు విరిగిపడి విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. ఏ సమయంలోనైనా విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే టోల్ ఫ్రీ 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మంగళవారం వేసిన గాలి కారణంగా వందల సంఖ్యలో చెట్లు కొమ్మలు విరిగిపడటంతో చాలా వరకు వైర్లు తెగిపడటం,స్తంభాలు నేలకొరిగడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. మంగళవారం వేకువ జామున 3 గంటల వరకు సిబ్బంది పనిలో ఉంచి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. 1912 కి ఫోన్ చెయ్యడం ద్వారా నేరుగా మీ ప్రాంతానికి చెందిన సిబ్బందికి సమాచారం చేరవేసి వెంటనే సమస్య పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో విజేత విజయనగరం

విజయనగరం టౌన్ : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీల్లో విజయనగరం బాలికల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ తదితరులు చేతులు మీదుగా బహుమతి అందుకున్నారు.

మూడో దశ పనులకు సిద్ధం కావాలి

- జూన్ నాటికి ప్రాధాన్యతా భవనాలను పూర్తి చేయాలి
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

క్షేత్రస్థాయి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు బాగా పనిచేస్తున్నాయని, అక్కడక్కడా ఉన్నలోపాలను తొలగించి, మరింత సమర్ధవంతంగా పనిచేయడానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఈనెల 19 నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో పారిశుధ్య కార్యక్రమంపై దృష్టిపెట్టాలని, డిఎల్‌డిఒ వ్యవస్థ మరింత సమర్ధవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పంచాయితీరాజ్, విద్య, వైద్య శాఖలపై జెడ్‌పి సమావేశ మందిరంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ నాడూ-నేడు మూడో దశ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త పాఠశాలలతోపాటు మొదటి, రెండోదశకి ఎంపికైన పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్ బ్లాక్స్ తదితర మిగిలిపోయిన పనులను కూడా మూడోదశలో తీసుకోవాలని సూచించారు. మూడో దశ తరువాత అన్ని రకాల పాఠశాలలు, వసతి గహాలు అన్ని వసతులతో, ఆధునిక సదుపాయాలతో శతశాతం సిద్ధం కావాలని, అందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై విస్తత ప్రచారం

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలని ఆదేశించారు. సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకొనేలా చూడాలని కోరారు. సిఇఒ, డిప్యూటీ సిఇఒ, డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల డిఇఒలు, డ్వామా పీడీలు, పంచాయతీరాజ్ ఎస్ఇలు, డిసిహెచ్‌ఎస్‌లు, డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పర్యావరణ పరిరక్షణపై సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పర్యావరణపరిరక్షణ కోసం మనజీవన శైలిఉద్యమంలో భాగంగా కాలుష్యనియంత్రణ మండలి, ఎన్‌వైకె ఆధ్వర్యాన బుధవారం నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ క్రీడా మైదానం నుంచి గంటస్తంభం, బాలాజీజంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్సు, మయూరిజంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం, డిఎఫ్‌ఒ బి.అప్పలరాజు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కెవిఎన్ రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, అటవీశాఖ,పలు పరిశ్రమల సిబ్బందితో పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. .

48 గంటల్లో వీధి దీపాల సమస్య పరిష్కారం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వీధి దీపాల మరమ్మతులను 48 గంటల్లో పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు, కమిషనర్ ఆర్. శ్రీ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుగా ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. ఆ తర్వాత ప్రజారోగ్య విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, 61వ సచివాలయం విషయాలపై సమీక్ష చేపట్టారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న ప్రగతి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ నగరంలో అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. మరమ్మతులకు గురైన వీధి దీపాల సమస్యలను 48 గంటల్లోగా పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య పరంగా మరింత మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు తగు ఆదేశాలు జారీ చేసామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అనేక సమస్యలను పరిష్కరించి టెండర్లు పిలిచి పనులు పూర్తయ్యే విధంగా చొరవ చూపామన్నారు. ఇటీవల ప్రారంభించిన మహిళా పార్కులో అంచనాలకు మించి అధిక శాతం మంది ప్రవేశించడంతో పార్కులో అనేక క్రీడా సామాగ్రి మరమ్మతులకు గురైనట్లు గుర్తించామన్నారు. అందువల్ల పది రోజులపాటు పార్కును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చెప్పారు. మరమ్మతుల అనంతరం ప్రజా వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ మరమ్మత్తులకు గురైన ప్రాంతాలను సరిచేసి తదుపరి కౌన్సిల్ ఆమోదం మేరకు ప్రవేశ రుసుమును ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నామన్నారు. దీనివల్ల ఖచ్చితంగా పార్కులోకి ప్రవేశించాలనుకునే వారే టిక్కెట్ తీసుకుని పార్కులోకి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

మాట్లాడుతున్న డిప్యూటీస్పీకర్ కోలగట్లవీరభద్రస్వామి

చెక్కును కమిటీ సభ్యులకు అందిస్తున్న కంది చంద్రశేఖర్‌రావు

రామాలయానికి రూ.30వేలు విరాళం

డెంకాడ: నెల్లిమర్ల మండలం మల్యాడ గ్రామంలోని రామాలయ నిర్మాణానికి డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు రూ.30వేల చెక్కు విరాళంగా అందించారు. ఈ మేరకు అక్కివరంలోని తన నివాసంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు ఆ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి విజయనగరం పార్లమెంటరీ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తంగుడుబిల్లి ఎంపిటిసి చందక చిన్నం నాయుడు, గ్రామ సర్పంచ్ పప్పల బలరాం, మాజీ సర్పంచ్ పొట్నూరు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పల్లి అప్పలనాయుడు, లెంక గాంధి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో వైసిపి వైఫల్యం

బొబ్బిలి: ప్రజా పాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయం చెప్పడం లేదన్నారు. పేదలకు బియ్యం కేంద్రం ఉచితంగా సరఫరా చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం అన్యాయమన్నారు. వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. వైసిపి అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తామన్నారు. బెల్లం రైతులను ఆదుకోవాలని కోమటిపల్లి, ముగడ బెల్లం రైతులు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం పూడివలస, పినపెంకి గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని, బొబ్బిలి నాయకులు మరిశర్ల రామారావు, పి.మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయానికి వితరణ

గ్రంథాలయానికి వితరణ అందిస్తున్న శేఖర్

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయానికి డెంకాడకు చెందిన రొంగలి శేఖర్ మాస్టర్ బుధవారం 24 కథల పుస్తకాలను అందించారు. అదే గ్రామానికి చెందిన యువత గ్రంథాలయానికి రెండు బుక్ రాక్స్‌ను వితరణగా అందించారు. దాతలకు లైబ్రేరియన్ వై.మహేశ్ అభినందనలు తెలిపారు.

మంచి సేవలతోనే గుర్తింపు

డిఎస్‌పిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, క్లబ్ ప్రతినిధులు

బొబ్బిలి : మంచి సేవలతోనే గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు అన్నారు. రైల్వే డిఎస్‌పిగా బదిలీ అయిన బి.మోహన రావును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సూర్య రెసిడెన్సీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలు చేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. సర్వీసులో ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణ, నేరాలు అదుపు చేసేందుకు మోహనరావు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. నూతన డిఎస్‌పి శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తీక్, అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, వైసిపి నాయకులు శంబంగి వేణు, ఇంటి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బోర్లుకు మరమ్మతులు

వంగర: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని తలగాం గ్రామంలో రెల్లి వీధి, మాదిగ వీధి, గొల్ల వీధిలో ఒక్కో బోరు చొప్పున, పట్టువర్ధనంలో ఒక బోరుకు బుధవారం మరమ్మతులు చేసి తాగునీరు అందించడంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానిక్‌లు కృపారావు, రామకృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

20న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తాటిపూడి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శారదా బాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు సంబందించి 5,6,7,8 తరగతులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలకు సంబంధించి మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు విజయనగరంలోని వివిధ పరీక్షా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబందించి అభ్యర్థుల హాల్ టిక్కెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను ఐడి, పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లును పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని ఆమె వెల్లడించారు.

గోగు రైతులకు అవగాహన

బలిజిపేట : మండలంలోని మిర్తివలస రైతు భరోసా కేంద్రంలో గోగు పంట ఉత్పత్తి, విత్తన ఎంపికపై గోగు రైతులకు అవగాహన సదస్సు రామకిరణ్, చంద్రశేఖర్ మార్కెటింగ్ మేనేజర్ ఆఫ్ జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. గోగులో తోసా రకమైన జెఆర్ఒ-204 పంట రకం ఎకరానికి కిలో విత్తనం (సబ్సిడీలో), డ్రమ్‌సీడర్‌తో వరుసల క్రమంలో విత్తుకోవాలి వాటికి సంబంధించిన సీడర్‌ను అందిస్తామని అన్నారు. ఇది 90రోజులకు పంట కోతలు దశకు, ఊరవేతకు వస్తుందని, జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు పంట మద్దతు ధరకు నారను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి సీనియర్ కార్యకర్తకు నివాళి

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ పంచాయతీ బిల్లగుడ్డివలస మాజీ సర్పంచ్ కేంద్రుక సన్యాసి సోదరుడు, సీనియర్ తెలుగుదేశం కార్యకర్త అయిన కేంద్రుక కుంబులు బుధవారం వేకువ మృతి చెందారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్ నాయుడు, హాస్పిటల్ మాజీ కమిటీ చైర్మన్ రెడ్డి చిన్నమనాయుడు, బుడితి శ్రీరాములు కుంబులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు అభినయ గేయాలు దోహదం

ప్రజాశక్తి- పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పదవ రోజు అభినయ గేయాలతో విద్యార్థులకు ఉత్సాహమని తంపంటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ అవార్డ్ గ్రహీత కె. జనార్ధనరావు అన్నారు. విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకత వెలికి తీయడానికి అభినయ గేయాలు ఉపయోగపడతాయని, ఈ గేయాలు నేర్చుకోవడంలో విద్యార్థుల్లో ఉత్సాహం, ఆనందం, ఆరోగ్యం, ప్రతిభ, తెలివి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. డ్రాయింగ్ టీచర్ జి.మురళీకష్ణ పనికిరాని వస్తువులతో బొమ్మలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

గ్రామ సందర్శన షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలి

- వైద్యులు సెలవులో వెళ్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- నాణ్యత గల విద్యాకానుక కిట్లు మాత్రమే అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కొత్తవలస, లక్కవరపుకోట

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజల్లోకి మరింత విస్తతంగా తీసుకువెళ్లి నిర్ణీతరోజుల్లో వైద్యులు తమ గ్రామాలను సందర్శిస్తారనే అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వైద్యాధికారుల ను ఆదేశించారు. ఎక్కడైనా వైద్యులు సెలవులో వెళ్తే ఆయా చోట్ల వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం విస్తృతంగా పర్యటించారు. కాటకాపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నిర్వహిస్తున్న

కొత్తవలస: సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, శిబిరానికి సేవలు పొందేందుకు వచ్చిన ప్రసూతి మహిళలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. కొత్తవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శృతి ప్రసూతి సెలవులో వెళ్లినట్లు తెలుసుకొని వైద్య సేవల్లో అంతరాయం లేకుండా చూడాలని వెంటనే ఆమె స్థానంలో వేరొక రిజర్వ్ వైద్యాధికారిని పంపించాలని డిఎంహెచ్ఒకు ఆదేశించారు. గ్రామంలో నిర్మిస్తున్న వెల్ నెస్ కేంద్రం భవనాలను త్వరగా నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను పూర్తిగా నాణ్యత ను తనిఖీ చేసిన తర్వాత మాత్రమే విద్యార్థులకు అందించాలనీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కొత్తవలస మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక కిట్ల మండల స్థాయి స్టాక్ పాయింట్ ను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకు పంపిణీ కోసం సిద్ధం చేస్తున్న కిట్లలోని బూట్లు, యూనిఫాం, బెల్టు, పుస్తకాలను తనిఖీ చేశారు. బలిఘట్టంలో నాడు నేడు కింద చేపట్టిన పాఠశాలల ఆధునికీకరణ పనులు పరిశీలించారు. పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను తనిఖీ చేశారు. పాఠశాలలు తెరిచే సమయానికి పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు.

బలిఘట్టంలో పేదలందరికీ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కాలనీ లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు. కంటకాపల్లి గ్రామ సచివాలయం తనిఖీ చేసి ఆయా కార్యదర్శులు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న భవనాల ప్రగతి, ఇళ్ల నిర్మాణం, నాడు నేడు పనులపై ఆరాతీశారు. నిమ్మలపాలెంలో ఏర్పాటు చేసిన

ఎల్‌కోట : విద్యాకానుక కిట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రం వద్ద ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ మొక్కలు నాటారు. పర్యటనలో ఇన్ ఛార్జ్ తహశీల్దారు హేమంత్ కుమార్, ఎంపిడిఒ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపు కోట మండలం రంగాపురంలో ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. సంతపేట పాచివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. తక్కువ మంది వేతనదారులు పనిలోకి రావడానికి కారణాలు తెలుసుకున్నారు. రెండు పూటలు పనిలోకి వచ్చేందుకు వేతనదారులు ఆసక్తి చూపడం లేదని మండల స్థాయి సిబ్బంది వివరించారు. మండలంలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలనీ స్పష్టం చేశారు. ఎల్. కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి ఇపిహెచ్‌సి ద్వారా అందుతున్న వైద్యఆరోగ్య సేవలపై ఆరా తీశారు. పిహెచ్‌సి కోసం కొత్తగా నిర్మిస్తున్న భవనాలు త్వరగా పూర్తిచేసి అందులోనే సేవలు అందించే చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎల్.కోట గ్రామ సచివాలయం తనిఖీ చేసి స్పందన కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సంబంధ వినతులు పరిష్కరిస్తున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన పలువురి నుంచి రెవెన్యూ సమస్యలపై వినతులు ఇవ్వగా, వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం గొల్లపేట సచివాలయం పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలైన జోగిందిర, కర్రిందిరవలస గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్ళి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి

చీపురుపల్లి : బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల మెరుగైన జీవనోపాదుల కోసం ప్రభుత్వ రాయితీలు నేరుగా వచ్చేలా కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, వేణుగోపాలనాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి ఆరా తీశారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, మోపాడ సర్పంచ్ బడ్డుకొండ రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి ఎన్.అప్పలనాయుడు, పలువురు వైసిపి నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురపల్లి పంచాయతీ పరిధిలోని మెట్టకొలనిలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్

డెంకాడ : ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే

పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, నాయకులు వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, ఎంపిటిసి కోసిరెడ్డి రమణ, పతివాడ రాజారావు, పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై అసంతృప్తి

వేపాడ : పనులు చేస్తున్న కూలీలు

బొబ్బిలి : స్థానిక మున్సిపల్ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు, ఆంధ్రకేసరి, ఆంధ్రరత్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనులు నత్తనడకన సాగడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శరవేగంగా నాడు నేడు పనులు

వేపాడ : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత నాడు నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం సిఆర్‌పి కె. రాంప్రసాద్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరిశీలించారు. పనులను మరింత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

రెండు పూటలా పని చేయలేం

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఉపాధి పనులు రెండు పూటలూ తాము చేయలేమని ఒక్క పూట మాత్రమే పెట్టాలని మండలంలోని ఉపాధి వేతన ధారులు అధికారులను వేడుకుంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యు ఒక్క పూట పెట్టాలని, గత కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయని, వడ గాడ్పులు వీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతన దారులలో కూడా కొంత మంది వయస్సు పై బడిన వారు వున్నామని, వడ గాడ్పులు వల్ల ఏమైనా జరగ రానిది జరిగితే కుటుంబ సభ్యులు వీధిన పడవలసి వస్తుందని, ప్రభుత్వం ఉపాధి పనులు ప్రవేశ పెట్టడం మంచిదే అయినప్పటికీ, ప్రస్తుత ఎండ తీవ్రతను బట్టి ఒక్క పూట పెట్టాలని డిమాండ్

ఎండలో పని చేస్తున్న వేతనదారులు

చేస్తున్నారు. కొన్ని మండలాల్లో ప్రస్తుతం ఒక్క పూటే పనులు జరుగుతున్నాయని ఒక్క ఈ మండలంలోనే మండే ఎండల్లో రెండు పూటలు ఉపాధి పనులు జరుగుతున్నాయని అధికారులు ఎండలను దృష్టిలో పెట్టుకొని ఒక్క పూటే ఉపాధి పనులు జరపాలని ఉపాధి వేతన ధారులు కోరుకుంటున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

మెరక ముడిదాం : మండలంలోని గర్భాం సచివాలయం, బస్‌స్టాండ్ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండే ఎండలు కానరాని చలివేంద్రాలు అనే కథనం ప్రజాశక్తిలో మంగళవారం వెలువడటంతో అధికారులు స్పందించారు. వెంటనే రెండు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసి పాదచారుల దాహర్తిని తీర్చారు. దీంతో మండల ప్రజలు, ప్రయాణికులు, సచివాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చలివేంద్రాలు ప్రారంభోత్సవంలో గర్భాం పంచాయతీ ఇఒ వాసు దేవరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటిన గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- మెంటాడ

ఎవరి స్వార్థం వారు చూసుకుంటూ రక్త సంబంధీకులకు సహితం సహకరించని నేటి సమాజంలో ఇంకా మానవత్వం ఉందని జక్కువ గ్రామ పెద్దలు చాటిచెప్పారు. మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన మన్నేపూరి నారాయణరావు డిగ్రీ వరకు చదువుకుని ఖాళీగా ఉండడంతో గ్రామ పెద్దల సహకారంతో గ్రామ సచివాలయంలో వాలంటీర్‌గా అవకాశం కల్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిదండ్రులను ఆ వచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో తన రెండు కిడ్నీలు పాడైపోయి తల్లిదండ్రులకు భారంగా మారాడు. తన కిడ్నీలు ఆపరేషన్ కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని తెలుసుకొని ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టిమిట్టాడుతుండగా గ్రామ పెద్దలు అండగా నిలిచారు. ఆరోగ్యశ్రీ పథకంలో రూ.5లక్షలు వరకు వస్తాయని మిగతా డబ్బులు మానవతా దృక్పథంతో సహకరించాలని గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, సివిల్

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న గ్రామపెద్దలు

కాంట్రాక్టర్ కుప్పిరెడ్డి మోహన్ రావు కోరుతూ ఆయన రూ. 10వేలు అందించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, జక్కువ పిఎసిఎస్ అధ్యక్షులు రెడ్డి అప్పారావు, కర్రీ అప్పలస్వామి రూ. 5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎవరైనా మానవత్వం కలిగిన వారు ఆ యువకునికి సహాయం చేయాలని తన పైనే ఆధారపడి బ్రతుకుతున్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.



ఆల్బమ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్సర్ బైక్ రమణ, సీతం కాలేజీ కరస్పాండెంట్ శశిభూషణరావు

పల్సర్ బైక్ రమణ నూతన ఆల్బమ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

పల్సర్ బైక్ రమణ పాడి, అభినయించిన సరోజ నూతన ఆల్బమ్ పాట పోస్టర్ ఆవిష్కరణ బుధవారం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పల్సర్ బైక్ రమణ, కొరియో గ్రాఫర్ రితిక్ మాస్టర్ విచ్చేశారు. కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు మాట్లాడుతూ పల్సర్ బైక్ రమణని అభినందిస్తూ, అతను అహర్నిశలు శ్రమిస్తే ఇంతటి స్థాయికి చేరుకున్నారని అన్నారు. కొత్త సరోజా ఆల్బమ్ కూడా అద్వితీయమైన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రమణ మాట్లాడుతూ ఇంట్లో సమస్యల వలన పదో తరగతి మాత్రమే చదువుకోవాల్సి వచ్చిందని ఎన్నో అవమానాలను భరించి, కష్టాలను ఎదుర్కొని, ప్రేక్షకులు అండదండలతో అందరి మన్ననలను పొంది ఇంతటి స్థాయికి చేరుకున్నానని అన్నారు.

పనికిమాలిన ప్రభుత్వంలో ప్రజలందరికీ కష్టాలే

- టిడిపి విశాఖ పార్లమెంటరీ ఇన్‌ఛార్జ్ శ్రీభరత్
- చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పనికిమాలిన ప్రభుత్వంలో ప్రజలందరికీ కష్టాలేనని టిడిపి విశాఖ పార్లమెంటరీ ఇంఛార్జి ఎం. శ్రీభరత్ అన్నారు. ఈ నెల 18,19 తేదీలో ఎస్‌కోట నియోజకవర్గంలో టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు పర్యటన ఏర్పాట్లును ఆయన బుధవారం పరిశీలించారు. ప్రధానంగా చంద్రబాబు బహిరంగ సభా ప్రాంగణ స్థలం, కొత్తూరు శివాలయం నుండి దేవి గుడి వరకు రోడ్ షో రూట్ మ్యాప్, 18వ తేదీ రాత్రి చంద్రబాబు బస చేసే శిరికి గ్రీన్ సిటీలో ఉన్న రూమ్ పెసిలిటీ, ట్రాఫిక్, పోలీస్ భద్రతా నియంత్రణా చర్యలు, అంతర్జాలం వంటి సాంకేతిక పరికరాలు వివిధ అంశాల మీద మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు అన్ని బాగానే ఉన్నాయన్నారు. చీపురపల్లి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి చేతకాని పాలన వల్లనే రాష్ట్ర ప్రజలందరూ అనేక ఇబ్బందులను పడుతున్నారన్నారు. చంద్రబాబు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రమంతా పర్యటన చేస్తూ ప్రజల కష్టాలను, ఇబ్బందులను తెలుసు కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపి ప్రభు త్వాన్ని ఇంటికి పంపించడానికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ సిద్ధంగా ఉన్నార న్నారు. ఈ పరిశీలనలో మంగళగిరి పార్టీ

మాట్లాడుతున్న శ్రీభరత్, కోళ్లలలితకుమారి, నాగార్జున

కార్యాలయం నుండి వచ్చిన ప్రోగ్రామింగ్ కమిటీ పర్యవేక్షకులు, రాబిన్ శర్మ టీమ్, ఎస్‌కోట మండల అధ్యక్షులు, జిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యని ర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, క్లస్టర్ ఇంఛార్జ్ ఇందుకూరి శ్రీనురాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు కె.మల్లేశ్వరరావు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), నాయకులు ఎల్లపు సూరిబాబు, కనకాల శివ, రాష్ట్ర టిడిపి అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, లాలం అర్జునరావు, పొట్నూరు వెంకట రత్నాజీ, కొల్లి వెంకటరమణమూర్తి, మళ్ళా రామకృష్ణ, విరోతి శివాజీ, వాకాడ బాల ఈశ్వర్ భరత్ పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతలు నమోదు

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో బుధవారం మూడు మండలాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా వంగరలో 40.8, పూసపాటిరేగలో 40.6, రామభద్రపురంలో 40.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల్లో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం వెల్లడించింది. 18న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

గ్రంథాలయాల్లో విజ్ఞానం

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక శాఖా గ్రంథాలయం సీతంపేటలో వేసవి విజ్ఞాన శిబిరం బుధవారానికి పదో రోజుకు చేరుకుంది. పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞాన పరమైన పుస్తకాలు చదివారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాతి పెట్టిన మృత దేహం వెలికితీత

రామభద్రపురం: మండల పరిధిలోని ముచర్లవలసకు చెందిన రేగాన గనేశ్వర రావు (29) సొంత ఇంట్లోనే ఈ నెల 10 తెల్లవారు జామున ఉరి వేసుకొని మృతి చెందాడు. అప్పట్లో ఎవరికీ తెలియజేయకుండా వారి కులాచారం మేరకు మృతదేహాన్ని పాతి పెట్టారు. ఐతే ఇతని ఉరి వేసుకోవడం పై కుటుంబ సభ్యులకు కొన్ని అనుమానాలు రావడంతో మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సురేంద్ర నాయుడు, ఇంచార్జి తహశీల్దార్ సుబ్బారావు, వైద్యాదికారులతో కలిసి బుధవారం పాతిపెట్టిన మత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడు అరెస్టు

గజపతినగరం: బెల్ట్ షాప్ నిర్వాహకుడుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిహెచ్ గంగరాజు తెలిపారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన వియ్యపు అప్పలరాజు అనే వ్యక్తి మద్యం బాటిళ్లతో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎం.వెంకటాపురం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు, చెప్పారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనంతో పాటు 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.